యువకులను చితకబాదిన గ్రామస్తులు

భిక్కనూరు, ఏప్రిల్ 1 : మండలంలోని బస్వాపూర్‌లో గ్రామస్తులు ఇద్దరు యువకులను చితకబాదారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల గ్రామంలో ఒకే రోజు తొమ్మిది ఇండ్లల్లో చోరీలు జరిగిన విషయం తెలిసిందే. సోమవారం వేర్వేరు పనుల నిమిత్తం ఇద్దరు వ్యక్తులు బస్వాపూర్ గ్రామానికి వచ్చారు. వారిని పట్టుకొని గ్రామస్తులు తీవ్రంగా కొట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై ఆంజనేయులు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్రామస్తుల దాడిలో గాయపడిన ఇద్దరిని అదుపులోకి తీసుకొని దవాఖానకు తరలించారు. గుర్తు తెలియని వ్యక్తులను పట్టుకున్నట్లు పోలీసులకు సమాచారం ఇవ్వకుండా.. వారిపై దాడి చేసిన పది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాల్లోకి వస్తే వెంటనే 100 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని, వారిపై దాడికి పాల్పడితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై తెలిపారు.

తప్పిపోయిన బాలుడు తల్లిచెంతకు..

బాలుడిని తల్లికి అప్పగిస్తున్న హెచ్‌సీ అరుణ

వినాయక్‌నగర్, ఏప్రిల్ 1: తప్పిపోయిన బాలుడిని తల్లివద్దకు చేర్చింది ఒక మహిళా హెడ్ కానిస్టేబుల్. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకున్నది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. గౌతంనగర్‌కు చెందిన కేశిరెడ్డి లత తన రెండున్నరేండ్ల బాబును తీసుకొని జిల్లా ప్రభుత్వ దవాఖానకు వచ్చింది. బాబును దవాఖాన కారిడార్‌లో వదిలి పని చూసుకుంటున్నది. బాబు ఒంటరిగా బయటికి వచ్చి బస్‌స్టేషన్‌కు చేరుకున్నాడు. అక్కడ డ్యూటీలో ఉన్న మహిళా హెడ్‌కానిస్టేబుల్(హెచ్‌సీ) అరుణ బాలుడిని గమనించి దగ్గరకు తీసుకున్నది. వివరాలు సేకరించి, బాలుని తల్లికి అప్పగించింది. మహిళా హెడ్‌కానిస్టేబుల్‌కు బాలుడి తల్లి కృతజ్ఞతలు తెలిపింది. పిల్లలను బయటికి తీసుకెళ్లిన సమయంలో జాగ్రత్తగా ఉండాలని ఎస్‌హెచ్‌వో ఈ సందర్భంగా సూచించారు.

వేట కొడవలితో అర్ధరాత్రి యువకుడి హల్‌చల్

యువకుడి చేతిలో వేటకొడవలి

వినాయక్‌నగర్, ఏప్రిల్ 1: చేతిలో వేట కొడవలితో ఓ యువకుడు నగరంలో సోమవారం అర్ధరాత్రి హల్‌చల్ చేశాడు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. హైమదీపుర కాలనీకి చెందిన జబ్బార్ వేట కొడవలి పట్టుకొని.. అతడిని తరచూ బెదిరిస్తున్న ఇస్తాక్‌పై దాడి చేసేందుకు అర్సపల్లి చౌరస్తా వద్దకు వచ్చాడు. అదే సమయంలో అక్కడ ఉన్న వారు జబ్బార్‌కు నచ్చజెప్పి పంపించారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో రఘుపతి మంగళవారం తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

భిక్కనూరు, ఏప్రిల్ 1 : మండలంలోని భాగిర్తిపల్లి గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సును మంగళవారం రాత్రి నిర్వహించారు. గ్రామస్తులకు మూఢ నమ్మకాలు, రోడ్ సేఫ్టీ, మత్తు పదార్థాల వినియోగం తదితర విషయాలపై పోలీస్ శాఖ, ఐ అండ్ పీఆర్ కళాకారుల ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రంలో ఎస్సై ఆంజనేయులు, కళాకారులు సుధాకర్, పావని, గ్రామస్తులు పాల్గొన్నారు.

బస్‌స్టాప్, మురికి కాలువలు శుభ్రం

అంబాలిపేటలో పరిశుభ్రంగా బస్‌స్టాప్

మురుగు కాలువను శుభ్రం చేస్తున్న కార్మికులు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

బీబీపేట్(దోమకొండ), ఏప్రిల్ 1 : దోమకొండ మండలంలోని అంబారీపేట గ్రామంలో బస్‌స్టాప్, మురికి కాలువలను అధికారులు శుభ్రం చేయించారు. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'పారిశుద్ధ్యంపై పట్టింపేదీ' శీర్షికన ఆదివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం డీఎల్పీవో శ్రీనివాస్ ఆదేశాలు, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సూచనల మేరకు గ్రామ పంచాయతీ కార్యదర్శి పద్మ గ్రామంలో చెత్త కుప్పగా మారిన బస్‌స్టాప్, పలు వార్డులో మురికి కాలువలను శుభ్రం చేయించారు. కాలనీ వాసులు అధికారులకు, 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి ధాన్యం గింజనూ కొంటాం

బాన్సువాడ రూరల్, ఏప్రిల్ 1 : రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి రైతులకు సూచించారు. బాన్సువాడ మండలం కొల్లూరు గ్రామంలో బాన్సువాడ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సబ్ కలెక్టర్ కిరణ్మయి, రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి ఆయన మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎస్‌వో మలికార్జున్, తహసీల్దార్ వరప్రసాద్ పాల్గొన్నారు.

మహిళ మెడలో నుంచి బంగారు గుండ్లు చోరీ

బాన్సువాడ, ఏప్రిల్ 1 : పట్టణంలోని తాడ్కోల్ చౌరస్తాలో ఓ మహిళ బస్సు ఎక్కుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలో నుంచి బంగారు గుండ్లను చోరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పిట్లం మండలంలోసి సిద్ధాపూర్ గ్రామానికి చెందిన బాల పోశవ్వ బాన్సువాడలోని ప్రభుత్వ ఏరియా దవాఖానకు వైద్యం చేయించుకునేందుకు వచ్చింది. దవాఖానలో వైద్యం చేయించుకొని సిద్దాపూర్‌కు తిరిగి వెళ్లే క్రమంలో తాడ్కోల్ రోడ్డులో బస్సు ఎక్కుతుండగా మెడలో నుంచి ఏదో పడిపోయినట్లు అనిపించిందని, చూసే సరికి పోశవ్వ మెడ లో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు ఏడు గ్రాముల గుండ్లు చోరీకి గురైనట్లు తెలిపింది. వెంటనే బాన్సువాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

అంబాలిపేట గ్రామంలో పాత వాటర్ ట్యాంకు పునరుద్ధరణ పనులు చేస్తున్న దృశ్యం

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

బీబీపేట్(దోమకొండ), ఏప్రిల్ 1 : దోమకొండ మండలం అంబారీపేట గ్రామానికి చెందిన మ్యాకల పవన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన ఆరుట్ల అనిల్ మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి 25 కిలోల బియ్యంతోపాటు ఆర్థిక సహాయం చేసినట్లు తెలిపారు. గ్రామంలో ఎస్సీ కాలనీలో శిథిలావస్థకు చేరిన పాత వాటర్ ట్యాంక్‌ను పునరుద్ధరణ పలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాల సంఘం యువకులు, సంఘం పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ

నమస్తే తెలంగాణ యంత్రాంగం,ఏప్రిల్ 1 : బాన్సువాడ పట్టణంలో సొసైటీ పరిధిలోని 26, 27, 28 చౌకదారుల దుకాణాల్లో వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి.. సబ్ కలెక్టర్ కిరణ్మయి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. బాన్సువాడ మండలం కొల్లూర్‌లో 10వ నంబర్ రేషన్ దుకాణంలో సన్నబియ్యాన్ని పోచారం పంపిణీ చేశారు. ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగారెడ్డిపేట్, రామారెడ్డి, పెద్ద కొడప్‌గల్, పిట్లం, లింగంపేట, నాగిరెడ్డిపేట, బీబీపేట, దోమకొండ, మాచారెడ్డి మండలం ఘన్‌పూర్‌తోపాటు ఆయా గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక నాయకులు, అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడలో సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్న వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి, కాసుల బాల్‌రాజ్

మానవత్వం చాటుకున్న పోలీసులు

మతిస్థిమితం లేని వ్యక్తిని దవాఖానకు తీసుకెళ్తున్న పోలీసులు

కామారెడ్డి, ఏప్రిల్ 1 : కామారెడ్డి పట్టణ పోలీసులు మానవత్వాన్ని చాటుకున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన వద్ద ఓ మతిస్థిమితం లేని వ్యక్తి రోడ్డుపై గాయాలతో పడి ఉన్నాడు. అతడిని గమనించిన బ్లూకోర్టు సిబ్బంది నర్సింహులు, వెంకటేశ్ వెంటనే స్పందించి ప్రథమ చికిత్స చేసిన అనంతరం ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లి చికిత్స చేయించారు.

నలుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

కామారెడ్డి, ఏప్రిల్ 1 : పాల్వంచ మండలంలోని వాడి గ్రామ శివారులో పేకాడుతున్న నలుగురిని మంగళవారం పట్టుకున్నట్లు మాచారెడ్డి ఎస్సై అనిల్ తెలిపారు. వీరి నుంచి రూ.22,260, రెండు బైక్‌లు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వివరించారు. పేకాడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేకాడితే 'డయల్ 100'కు సమాచారం అందించాలని ఎస్సై సూచించారు.

సవరణ

ఇసుక దందాలో వసూల్ రాజాలు అనే శీర్షికతో మార్చి 3వ తేదీన నమస్తే తెలంగాణ కామారెడ్డి జిల్లా సంచికలో కథనం ప్రచురితమైంది. కొంత మంది వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు పొరపాటున వచ్చిన ఈ వార్తలో పాల్వంచ మండలంలోని ఫరీద్‌పేట మాజీ సర్పంచ్ కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదు. ఈ కథనంలో పేర్కొన్న వ్యక్తులకు సైతం ఇందులో ఎలాంటి పాత్ర లేదు.

కారు దగ్ధం

వినాయక్‌నగర్, ఏప్రిల్ 1 : గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పంటించడంతో అక్కడే పార్క్ చేసిన కారు దగ్ధమైన ఘటన ఎల్లమ్మగుట్ట ప్రాంతంలో మంగళవారం చోటుచేసుకున్నది. ఎల్లమ్మగుట్ట ఏరియాలోని ఎల్ఐసీ ఆఫీసు వెనుకాల ఖాళీ ప్రదేశంలో చెత్త పేరుకుపోయింది. దానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. మంటలు ఎగిసిపడి అక్కడే పార్క్ చేసిన కారు సైతం కాలిపోయింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు.

రక్తదానంలో ఆదర్శం.. ఉపాధ్యాయుడు నాగరాజు

రక్తదానం చేస్తున్న ఉపాధ్యాయుడు నాగరాజు

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 1: ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తూ ఆ ప్రభుత్వ ఉపాధ్యాయుడు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఎల్లారెడ్డి మండలం భిక్నూర్ గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గోష్కె నాగరాజు రక్తదానం చేస్తూ ఎంతో మందికి ప్రాణదానం చేస్తున్నాడు. పాల్వంచ మండలం బండ రామేశ్వర్‌పల్లిలో మంగళవారం కామారెడ్డి రక్తదాతల సమూహం, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్, ఇండియన్ రెస్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఎల్లారెడ్డి పట్టణం నుంచి వెళ్లి రక్తదానం చేశాడు. విరివిగా రక్తదానం చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న నాగరాజుకు ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త, కామారెడ్డి రక్తదాతల సమూహం అధ్యక్షుడు జమీల్, ఉపాధ్యక్షుడు వెంకటరమణ ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందించారు. నాగరాజును ఆదర్శంగా తీసుకొని పలువురు ఉపాధ్యాయులు, యువకులు రక్తదానం చేయాలని వారు పిలుపునిచ్చారు.

ఆర్థిక సాయం అందజేత

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న స్నేహితులు

లింగంపేట, ఏప్రిల్ 1: ఓ మిత్రుడు గుండెపోటుతో మరణించడంతో తోటి స్నేహితులు ఆర్థికసాయం చేసి ఆదుకున్నారు. మండలంలోని పోల్కంపేట గ్రామానికి చెందిన కోర్పోతు నవీన్ కుమార్ (37) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 2003-04 పదో తరగతి బ్యాచ్ స్నేహితులు మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ వంతు సాయంగా పది వేల రూపాయలు అందజేశారు. మృతుడికి భార్య స్వరూప, ఇద్దరు కుమారులు కార్తీక్, కౌశిక్ ఉన్నారు. ఆర్థిక సహాయం చేసిన వారిలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దివిటి రమేశ్, స్నేహితులు బందం సంతోష్, మోహన్, నరేశ్, రాజు, మల్లికార్జున్, సుధాకర్‌రెడ్డి, చిన్నారావు, గడ్డి లక్ష్మి, నవనీత, కవిత, ప్రత్యూష, రజిని, రజిత, ప్రశాంతి, శైలజ, జ్యోతి తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తాడ్వాయిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

లింగంపేట(తాడ్వాయి), ఏప్రిల్ 1: తాడ్వాయి మండల కేంద్రంలో సీసీ రోడ్డు పనులను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ప్రారంభించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. హనుమాన్ ఆలయం నుంచి మార పోచమ్మ ఆలయం వరకు రోడ్డు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు రాజు, సంజీవులు, మహేందర్‌రెడ్డి, శ్యాంరావు, అఖిల్‌రావు, జ్యోతి, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురైన పోచారం ప్రధాన కాల్వ సైడ్‌వాల్స్

పోచారం వద్ద ప్రధాన కోతకు గురైన సైడ్‌వాల్

నాగిరెడ్డిపేట, ఏప్రిల్1: పోచారం ప్రధాన కాల్వ సైడ్‌వాల్స్ నీటి వరద తాకిడికి దెబ్బతిని కోతకు గురయ్యాయి. పోచారం ప్రధాన కాల్వ గేట్లకు సమీప దూరంలోనే సైడ్‌వాల్ కోతకు గురైంది. మొదటి, రెండో డిస్ట్రిబ్యూటరీల వద్ద నాలుగు చోట్ల కాల్వ సైడ్‌వాల్స్ కోతకు గురయ్యాయి. మాల్తుమ్మెద శివారులో, గోలిలింగాల, ఆత్మకూర్, తాం డూర్, రాఘవపల్లి గ్రామాల వద్ద సైడ్‌వాల్స్ కోతకు గురయ్యాయి. ఇవి గత యేడాది దెబ్బతినగా..నీటి పారుదల అధికారుల నిర్లక్ష్యంతో..పూర్తిగా కోతకు గురయ్యాయి. అధికారులు స్పందించి కోతకు గురైన సైడ్‌వాళ్లకు మరమ్మతులు చేపట్టాలని మండలంలోని ఆయా ఆయకట్టు పరిధిలోని రైతులు కోరుతున్నారు.

నాయక్ పోడులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

మహ్మద్‌నగర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆదివాసి నాయక్‌పోడు సేవా సంఘం సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు మొట్ట పెంటయ్య

నిజాంసాగర్, ఏప్రిల్ 1 : జిల్లాలోని నాయక్‌పోడులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంలో తహసీల్దార్లు నిర్లక్ష్యం వహిస్తున్నారని, దీనివల్ల జిల్లాలోని అనేకమంది విద్యార్థులకు అన్యాయం జరుగుతున్నదని నాయక్‌పోడు సంఘం జిల్లా అధ్యక్షుడు మొట్ట పెంటయ్య అన్నారు. మహ్మద్‌నగర్ మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆదివాసీ నాయక్‌పోడు సేవా సంఘ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నూతనంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ , రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోలేకపోతున్నామని నాయక్‌పోడు నిరుద్యోగ యువకులు తెలియజేశారు. ఇలాగే కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంలో ఇబ్బందులకు గురిచేస్తే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. జిల్లాలోని నాయక్‌పోడులకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్ట వెంకట్, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిర్నాపల్లి సాయిలు, జిల్లా ఉద్యోగ సంఘం అధ్యక్షుడు తౌడగారి సాయిలు, కార్యనిర్వాహక అధ్యక్షుడు ముత్యాల సంజీవులు, సాంస్కృతిక కార్యదర్శి పుట్ట బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రారంలో కుస్తీ పోటీలు

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 1: మండలంలోని రుద్రారం గ్రామంలో ఉగాది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ముత్యాల పోచమ్మతల్లి ఆలయం వద్ద కుస్తీ పోటీలు జరిగాయి. కుస్తీ పోటీల్లో మండలంలోని పలు గ్రామాలతో పాటు నాగిరెడ్డిపేట్, లింగంపేట్, నిజాంసాగర్, మహ్మద్‌నగర్, పిట్లం, బిచ్కుంద, మహారాష్ట్ర నుంచి పలువురు మల్లయోధులు పాల్గొన్నారు. సాయంత్రం కుస్తీపోటీలు కొబ్బరికాయతో మొదలయ్యాయి. విజేతగా నిలిచిన సిద్ధాపూర్ గ్రామానికి చెందిన గోపాల్‌కు రెండు తులాల వెండి కడియాన్ని గ్రామ కమిటీ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

కోమలంచ గ్రామంలో..


మహ్మద్‌నగర్ మండలం కోమలంచలో చివరి కుస్తీ విజేతకు బహుమతి అందజేస్తున్న గ్రామ పెద్దలు

నిజాంసాగర్, ఏప్రిల్ 1 : మహ్మద్‌నగర్ మండలంలోని కోమలంచ గ్రామంలో నల్ల పోచమ్మ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను రెండు దఫాలుగా ఉదయం, సాయంత్రం నిర్వహించారు. పోటీల్లో పాల్గొనడానికి చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలనుంచి మల్లయోధులు తరలివచ్చారు. విజేతగా నిలిచి భీమ్‌సింగ్ అనే మల్లయోధుడు మహారాష్ట్రలోని లాతుర్ నుంచి వచ్చి పోటీల్లో పాల్గొని రూ.2,100 నగదు బహుమతి గెలుచుకొన్నాడు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ బి. గంగారెడ్డి, మాజీ సర్పంచ్ సాదుల సత్యనారాయణ, నాగభూషణం గౌడ్, పోతా గౌడ్, ఖాలీఖ్, దుర్గాగౌడ్, సిద్ధిరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మత్తడి పోచమ్మ వద్ద కుస్తీ పోటీలు

లింగంపేట, ఏప్రిల్ 1: మండల కేంద్రంలోని మత్తడి పోచమ్మ ఆలయం వద్ద బుధవారం సాయంత్రం కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దుర్గెట్టి అశోక్ తెలిపారు. ఉగాది పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా కుస్తీ పోటీలు ఏర్పాటు చేశామన్నారు. కొబ్బరికాయ కుస్తీ నుంచి రూ. 500, రూ. వెయ్యి నగదు కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటితో పాటు రెండు తులాలు, మూడు తులాల వెండి కడియం కుస్తీ పోటీలు నిర్వహిస్తామని, పెద్ద సంఖ్యలో మల్లయోధులు పాల్గొని పోటీలు విజయవంతం చేయాలని కోరారు.

అన్‌లైన్ షాపింగ్‌లో మోసపోయిన మహిళ

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 1: ఆన్‌లైన్‌లో డ్రెస్ ఖరీదు చేసిన యువతి సైబర్ నేరగాళ్ల మాటలకు మోసపోయిన ఘటన రుద్రారం గ్రామంలో జరిగింది. ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేశ్ తెలిపిన ప్రకారం దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన యువతి ఇన్‌స్టాలో ఒక డ్రెస్‌ను ఆర్డర్ చేసింది. తర్వాత ఆమెకు డ్రెస్ బుక్‌చేసిన వారి నుంచి ఫోన్ వచ్చింది. వారు మోసపూరిత మాటలు చెప్పి, యువతిని నమ్మించి 40వేల 118 రూపాయలను కట్టించుకున్నారు. ఇంకా డబ్బులు కావాలని వేధించడంతో మోసపోయినట్లు గుర్తించిన యువతి వెంటనే సైబర్ టోల్‌ఫ్రీ నెంబర్ 1930కి ఫోన్ చేయగా 16వేల రూపాయలు హోల్డ్‌లో పడ్డాయి. యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

జుక్కల్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బిచ్కుంద, ఏప్రిల్ 1: జుక్కల్ మండల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. జుక్కల్ మండల కేంద్రంలో మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనాలకు పాల్పడుతున్నారని, తాళం వేసిన ఇండ్లనే టార్గెట్ చేసుకుని దొగతనాలు చేస్తున్నారని తెలిపారు. బంగారం ఇంట్లో పెట్టి తాళం వేసి వెళ్లకూడదన్నారు. వేసవికాలం దృష్ట్యా ఆరుబయట, మేడపైన నిద్రించినా ఇంట్లో ఉన్న వస్తువులపై జాగ్రత్త వహించాలన్నారు. తాళం వేసి ఊరికి వెళితే, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఎల్లారెడ్డిలో చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 1: ఎల్లారెడ్డి పట్టణంలో లబ్ధిదారుడికి స్థానిక నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కును మంగళవారం అందజేశారు. పట్టణంలోని మూడో వార్డు నయాబాది కాలనీకి చెందిన అబ్దుల్ హమీద్ అనే లబ్ధిదారుడికి రూ.21వేల విలువైన చెక్కును స్థానిక నాయకులు అందజేశారు. స్థానిక నాయకులు తుకారాం, మహ్మద్ రఫీక్, అజర్‌ఖాద్రి, రషీద్, నూరుల్లా తదితరులు ఉన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

కాటేపల్లిలో చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్ 1: మండలంలోని కాటేపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు మల్లప్ప పటేల్, శామప్ప పటేల్, మోహన్, హైమద్, నాగు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.